క్లుప్తంగా

ఆకట్టుకున్న 'బుద్ధునితో నా ప్రయాణం' నాటకం



నాటకంలోని ఓ దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: అభ్యుదయ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో 'బుద్ధునితో నా ప్రయాణం' నాటకం ప్రదర్శన సోమవారం రాత్రి ఓ ప్రైవేటు హాలులో ఘనంగా జరిగింది. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జీవితం, బోధనలు ఆధారంగా రూపొందించిన ఈ నాటకంలో బౌద్ధమతంపై అంబేడ్కర్ ఆసక్తి, ప్రభావాలను వివరించారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, దళిత ఆదివాసీ బహుజన సంఘాల జేఏసీ శ్రీకాకుళం ఆధ్వర్యంలో జరిగిన ఈ నాటకానికి కె.కె.రాజు దర్శకత్వం వహించారు. ముందుగా బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బహుజన సంఘం సభ్యులు, డాక్టర్ హర్షవల్లి, కంఠ వేణు, తైక్వాండో శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష అలంకరణ



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని నక్కవీధిలో ఉమజఠలేశ్వరస్వామి దేవాలయంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం



ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

జి.సిగడాం: విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని సంతవురిటి సర్పంచ్ బుదారి లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేశ్వరరావు అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన గ్రామ సచివాలయ ఉద్యోగులు అలుగోలు లక్ష్మీనారాయణ, నాగరాజు, మంగమ్మ, లక్ష్మీకాంతంలను మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దవళపేట సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, ఉప సర్పంచ్ చందనాల గణపతి, మాజీ సర్పంచ్ బత్తుల సన్యాసిరావు, నాయకులు పిల్లల శివకుమార్, చందనాల రంగారావు, సర్సింగ యాదవ్, బాలబొమ్మ లోకేష్, బాలబొమ్మ శ్రీనివాసరావు, సీతారాంబాబు, వాండ్రంగి రాంజీ, పంచాయతీ కార్యదర్శి హిమబిందు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగపంచమి వేడుకలు



పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో నాగపంచమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏటా శ్రావణ మాసంలో రెండు రోజుల పాటు నాగపంచమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో కుటుంబాలతో సహా టౌన్ హాలు వద్ద ఉన్న పుట్ట వద్దకు చేరి ఉపవాసాలను విరమించారు. అనంతరం స్వామివారి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో రంగ్రీజి సెక్రటరీ బాలాజీ, కమిటీ సభ్యులు పతంగి దయాల్, బాయికర్ వెంకటరమణ, సదర నాగరాజు, బాయికర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్తమ పీఎంశ్రీ పాఠశాలగా రణస్థలం మోడల్ స్కూల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: జాతీయ విద్యా విధానం-2020 ఐదో వార్షికోత్సవంలో భాగంగా జిల్లాలో ఉత్తమ పీఎంశ్రీ పాఠశాలగా రణస్థలం ఆదర్శ పాఠశాల ఎంపిక కావడం హర్షణీయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. కొండములగాంలోని రణస్థలం ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఢిల్లీలో జరిగిన ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల ప్రతిభ, తల్లిదండ్రుల విశ్వాసానికి గౌరవ సూచకంగా పాఠశాల నిలవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎ.త్రినాథరావు, బి.లావణ్య, ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కర్రీ.. నో వర్రీ!

- నగరంలోని కర్రీ పాయింట్లకు ఆదరణ
- వీధివీధినా అందుబాటులో కూరలు
- పార్శిల్ భోజనాలకు సైతం గిరాకీ
- జీవనోపాధి కల్పిస్తున్న కూరల అమ్మకం



కర్రీపాయింట్‌లో కూరలు, సాంబారు విక్రయిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం : మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల జీవనశైలి మారుతోంది. ఉన్నత చదువులు కోచింగ్ నిమిత్తం నగరానికి వచ్చే విద్యార్థులు, ఉద్యోగార్థులు, కొలువులకు వెళ్లే భార్యాభర్తలు, ప్రైవేట్ సంస్థలు, షాపుల్లో పనిచేస్తుండే వారికి పూర్తి స్థాయిలో వంటలు ఇంటిలో చేసే సమయం ఉండటం లేదు. ఈ కారణంగా ఇళ్లల్లో అన్నం మాత్రమే వండుకొని కర్రీ పాయింట్ల నుంచి కూరలు, రసం, సాంబారు వంటివి తెచ్చుకొని భోజనాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో నగరంలో కర్రీ పాయింట్ల వ్యాపారం లాభదాయకంగా మారింది. ముఖ్యంగా విద్యార్థులు, జీవనోపాధి కోసం నగరంలో ఏదో ఒక ఉద్యోగం చేస్తున్న యువత ఎక్కువగా ఉన్నారు. నగరానికి భవన నిర్మాణ కార్మికులు, మరికొన్ని పనులు చేసేందుకు చాలామంది చుట్టుపక్కల గ్రామాల నుంచి నిత్యం నగరానికి వస్తూ ఉంటారు. వీరు ఉదయం 8 గంటలకే ఇంటి నుంచి బయలుదేరడం వల్ల వంట చేసుకోవడం కంటే కర్రీ పాయింట్ల నుంచి భోజనాలు తెచ్చుకోవడంపై ఎక్కువగా ఆధారపడుతున్నారు.

డబ్బు, సమయం ఆదా..

ప్రస్తుత ధరలను పరిశీలిస్తే కర్రీ పాయింట్లలో లభించే రేట్లు కంటే వంట చేసుకుంటే ఎక్కువ ఖర్చయ్యే పరిస్థితి కనిపిస్తోంది. సమయం, డబ్బు ఆదా అవుతుండటంతో చాలామంది కర్రీ పాయింట్లపై ఆధారపడుతున్నారు. దీంతో నిర్వాహకులు కూరలతో పాటు అన్నం కూడా అమ్ముతున్నారు. పూర్తి భోజనం ధర రూ.80 నుంచి రూ.100 వరకు ఉండగా, అది ఇద్దరికీ సరిపోతుంది. 100 గ్రాములు బరువు కలిగిన ప్యాకెట్ కూర ధర రూ.25 నుంచి రూ.30 వరకు ఉంటోంది .సాంబార్ కూడా ఇదే ధరకు అమ్ముతున్నారు. రసం మాత్రం రూ.20 విక్రయిస్తున్నారు. కూరలకు భోజనానికి డిమాండ్ పెరగడంతో వీధివీధిన చిన్న చిన్న టేబుల్ ఏర్పాటు చేసి కూరలు, అన్నం ప్యాకెట్లు ఉంచి వాటిని విక్రయించడం ద్వారా పలువురు జీవనోపాధిని పొందుతున్నారు. నగర పరిధిలోని పాత బస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్స్, ఏడు రోడ్ల కూడలి, అరసవల్లి మిల్లు జంక్షన్, జీటీ రోడ్డు తదితర ప్రాంతాల్లో కర్రీ పాయింట్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కూరలకు బాగా డిమాండ్ ఉండటంతో పెద్దపెద్ద రెస్టారెంట్లలో సైతం వీటిని ప్యాకెట్లు ద్వారా విక్రయిస్తున్నారు. వీధుల్లో లభించే కూరలు శాకాహారం మాత్రమే ఉండగా, కొన్ని హోటల్లు రెస్టారెంట్లలో మాంసాహారం కూరలు సైతం అమ్ముతున్నారు. సెలవు రోజుల్లో మాంసాహార వంటకాలకు డిమాండ్ బాగా ఉంది. బిర్యానీని సైతం అతి తక్కువ ధరకు అందించే స్టాళ్లు నగరంలో 20 వరకు ఉన్నాయి. బిర్యానీ ప్యాకెట్ రూ.60 నుంచి రూ.250 వరకు అమ్ముతున్నారు. రెస్టారెంట్లలో అయితే రూ.300 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు.

కుటుంబ పోషణ..



మా ఇంట్లో నలుగురు కుటుంబ సభ్యులు ఉంటున్నాం. నిత్యం కూరల అమ్మడం వల్ల కుటుంబ పోషణకు సరిపోతుంది. ఇంటిల్లపాదీ కష్టపడుతున్నాం. రోజుకు 500 నుంచి 700 రూపాయల వరకు ఆదాయం వస్తోంది.

– లక్ష్మణరావు, కర్రీ పాయింట్ నిర్వాహకుడు, శ్రీకాకుళం

వంట చేసే సమయం లేకే..



సంతకవిటి మండలం నుంచి వచ్చి శ్రీకాకుళంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నా. వంట చేసుకునే సమయం ఉండడం లేదు. ఉదయమే విధులకు వెళ్లాల్సి వస్తుంది. అందుకే భోజనానికి కర్రీ పాయింట్లపై ఆధారపడుతున్నాం.

– రమేష్, ప్రైవేటు ఉద్యోగి, శ్రీకాకుళం

డ్రైవింగ్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఇన్‌చార్జి డీపీటీవో అమరసింహుడు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి హనుమంతు అమరసింహుడు కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న 21వ బ్యాచ్ డ్రైవర్లకు మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో మంచి డ్రైవర్లుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ వారంలోనే 22వ బ్యాచ్ మొదలవుతుందని పేర్కొన్నారు. లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్, ఒక సంవత్సరం అనుభవం కలిగిన వారం దరూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 40 రోజుల శిక్షణతోపాటు మెకానికల్ వర్క్, యోగా, వ్యక్తిత్వ వికాసం, ట్రాఫిక్, రోడ్డు ట్రాఫిక్ రూల్స్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని, వివరాలకు 7382921733 నంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్ కృష్ణవేణి, అకౌంట్స్ ఆఫీసర్ ఇ.రాజు, శ్రీకాకుళం 2 డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్.శర్మ, రీజనల్ కోర్ గ్రూప్ ఎఎస్ఎస్ శ్రీనివాస్, ట్రైనర్ వి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వర క్షేత్ర మహిమపై సినిమా



అంగీకారపత్రం చూపుతున్న నాయుడుగారి రాజశేఖర్

శ్రీకాకుళం అర్బన్ : దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర ఆలయ విశిష్టతపై 'శ్రీముఖ లింగేశ్వర క్షేత్ర మహాత్యం' అనే సినిమా రూపొందిస్తున్నట్లు నాయుడుగారి రాజశేఖర్ తెలిపారు. శ్రీకాకుళంలోని ఎన్జీవో కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీముఖలింగేశ్వర ఆలయంపై తాను ఇచ్చిన కథనం మేరకు కన్నడ శత చిత్రాల దర్శకుడు సాయి ప్రకాష్ చలన చిత్రాన్ని నిర్మించేందుకు అంగీకరించారని చెప్పారు. ఈ చలనచిత్రాన్ని 'శ్రీదేవి పిక్చర్స్' ఆధ్వర్యంలో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు అంగీకార పత్రాన్ని ఆవిష్కరించారు. దర్శకుడు సాయిప్రకాష్ ఖైదీగారు, అమ్మ నాగమ్మ, నాగదేవత వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారని తెలిపారు. నవంబర్లో షూటింగ్ ప్రారంభించనున్నామని చెప్పారు.

1200 మంది ఓటర్లు దాటితే రేషనలైజేషన్



సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పోలింగ్ కేంద్రంలో 1200 అంతకంటే ఎక్కువ ఓటర్లు ఉంటే రేషనలైజేషన్ తప్పనిసరిగా చేయాలని ఆర్డీవో కార్యాలయం ఏఓ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం శ్రీకాకుళం ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గం స్థాయిలో రాజకీయ పార్టీలు, తహసీల్దార్లతో రేషనలైజేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. కచ్చితమైన, పారదర్శక ఓటర్ల జాబితా తయారీకి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో గార తహశీల్దార్ చక్రవర్తి, శ్రీకాకుళం ఎన్నికల డీటీ జి.కె.శ్రీనివాసరావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అంబటి శ్రీను, మాదారపు వెంకటేష్, ఆర్.పురుషోత్తం, భాస్కరరావు, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సిక్కోలువాసికి ప్రతిష్టాత్మక అవార్డు



వర్సిటీ అధికారులతో డాక్టర్ పేడాడ కిరణ్ (మధ్యలో)

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన డాక్టర్ పేడాడ కిరణ్ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి అవార్డు అందుకున్నారు. ఈయన కెనడాలోని మనిటోబా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటికే అనేక పరిశోధనలు చేసి, జర్నల్స్‌రాసి ఎన్నో అవార్డులు సాధించారు. తాజాగా ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో జరిగిన 3వ గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో 'కాస్ట్ బిజినెస్ అండ్ సొసైటీ' పేరిట బెస్ట్ పేపర్ అవార్డును అందుకున్నారు. కిరణ్ ఐఎస్‌బీ హైదరాబాద్‌తోపాటు అనేక అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో విసిటింగ్ ప్రొఫెసర్‌గానూ సేవలు అందిస్తున్నారు. తండ్రి పేడాడ రాంబాబు ఇంటర్మీడియెట్ విద్యలో ప్రిన్సిపాల్‌గా పదవీవిరమణ చేయగా, తల్లి శ్రీలక్ష్మి గృహిణి. వీరి స్వస్థలం కోటబొమ్మాళి మండలం గంగరాం గ్రామం. ప్రస్తుతం శ్రీకాకుళం నగరంలో నివాసం ఉంటున్నారు.

పకడ్బందీగా సామాజిక తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణారావు

జి.సిగడాం:

జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలు సమర్థంగా నిర్వహించాలని ఎంపీడీఓ జి.రామకృష్ణారావు సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.25 కోట్లతో పనులు జరిగాయని చెప్పారు. ప్రతి ఇంటికి వెళ్లి వేతనదారుల నుంచి క్షుణ్ణంగా వివరాలు సేకరించాలన్నారు. మెటీరియల్ కాంపొనెంట్ పనులు సైతం పరిశీలించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఆర్‌పీ సూర్యనారాయణ, ఏపీఓ ఎస్.సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తమనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ



బియ్యం పరిశీలిస్తున్న చంద్రమౌళి

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఏబీసీ డబ్ల్యూవో జి.చంద్రమౌళి మంగళవారం తనిఖీ చేశారు. భోజన సదుపాయాలు, విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. వార్డెన్ లోలుగు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కూర్మనాథాలయానికి సామగ్రి వితరణ



ఏసీ, కంప్యూటర్ అందజేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

గార : ప్రముఖ క్షేత్రం శ్రీకూర్మనాథాలయానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీకూర్మం శాఖ ఉద్యోగులు ఏసీ, కంప్యూటర్‌ను మంగళవారం వితరణగా ఆందోళన చేపట్టారు. ఈవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రీజియన్ హెడ్ పైడి రాజా, మేనేజర్ చిన్న రామయ్యలు ఈవో కె.నర్సునాయుడుకు ఈ సామగ్రి అందజేశారు. భక్తుల సౌకర్యార్థం, కార్యాలయ పనుల కోసం సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా వీటిని అందించామని పేర్కొన్నారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మార్గంలో ప్రయివేటు ఆస్పత్రుల సముదాయం పక్కన ఉన్న డ్రైనేజీలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు. ఎచ్చెర్ల మండలం కుశాలపురం గ్రామానికి చెందిన నూక సింహాచలం (50)కు కిడ్నీలో రాళ్లు ఉండటంతో చికిత్స కోసం కుమారుడు రామచంద్రసాయితో కలిసి మంగళవారం ఆటోలో రిమ్స్‌కు బయల్దేరాడు. అంబేడ్కర్ కూడలి వద్ద ఇద్దరూ దిగారు. కుమారుడు ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద జిరాక్స్ షాపులో పనిచేస్తున్నందున వెళ్లి చూసొస్తానని.. ఈలోగా ఆసుపత్రికి వెళ్లి అక్కడ ఉండాలని చెప్పడంతో సింహాచలం నడుచుకుంటూ వెళ్తూ డ్రైనేజీలో పడిపోయాడు. వెంటనే సమీప ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సింహాచలం మృతిచెందాడు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

పీ-4 బాధ్యతల నుంచి టీచర్లను మినహాయించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీ-4 బాధ్యతల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి చిన్నబాబు, జిల్లా అధ్యక్షుడు సప్పటి మల్లేసు, ప్రధాన కార్యదర్శి పంచాది గోవిందరాజులు మంగళవారం విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే వినియోగించాలని, బోధనేతర పనులపై వినియోగించడం వల్ల విద్యా ప్రమాణాలు కుంటుపడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉపాధ్యాయులపై మెగా పేరెంట్స్ సమావేశాలు, కిట్స్ బయోమెట్రిక్ అథంటికేషన్, యూడైస్ వంటి బోధనేతర పనుల భారం విపరీతంగా పెరిగిపోయిందని పేర్కొన్నారు.

మాట తప్పడం చంద్రబాబు నైజం



రామచంద్రాపురంలో క్యూఆర్ కోడ్ ద్వారా అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ రఘురాం, నాయకులు



కొర్లాంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

గార: బూటకపు హామీలతో అధికారంలోకి రావడం , గద్దెనెక్కాక మాట తప్పటం చంద్రబాబు నైజమని గార ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. మంగళవారం రామచంద్రాపురం పంచాయతీలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్ ద్వారా బాబు మోసాలను వివరించారు. ఎన్నికల సమయంలో 143 హామీలిచ్చారని, వాటిలో ఏవీ అమలు చేయడం లేదన్నారు. గత ప్రభుత్వంలో తూచా తప్పకుండా హామీలు అమలు చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, ఎంపీటీసీ రుప్ప శ్రీనివాసరావు, అంబటి చినబాబు, అసెంబ్లీ గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు ఎస్.సత్యం, శీర ప్రభాకరరావు, గొలివి గోవిందరావు, అరవల రామకృష్ణ, శిమ్మ ధర్మరాజు, కోట రామారావు, చింతల గడ్డెయ్య, యు.కాశి, చీపురు అప్పలసూరి, జాడ పాపారావు, జోగి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కొర్ని, కొర్లాంలో....

అమలు చేయలేమని తెలిసీ హామీలిచ్చి ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకే చెల్లిందని డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు గొండు కృష్ణమూర్తి అన్నారు. గార మండలం కొర్ని, కొర్లాం పంచాయతీల్లో బాబూ ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పీస గోవిందరాజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, విద్యార్థులు, యువత, రైతులు, కార్మికులు, ఉద్యోగస్తులు.. ఇలా అన్ని వర్గాలనూ కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కూటమి పార్టీలకు ఘోర పరాజయం తప్పదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పీస శ్రీహరి రావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, అంధవరపు బాలకృష్ణమూర్తి, పండి కన్నబాబు, అట్టాడ గోపి, వజ్జ సత్యనారాయణ, వజ్జ వెంకటప్పలనాయుడు, అరవల రామారావు, పీస తిరుపతిరావు, కొర్లాం కుమారస్వామి, కరజాడ లక్ష్మునాయుడు, పీస కేశవరావు, పీస తిరుపతి రావు, సూర్యప్రకాశరావు, యగళ్ల అజయ్, కింతలి జగ్గారావు, పీస గోపి, వెంకటరమణమూర్తి, పెద్దప్ప గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

పాలకులకు రైతుల కష్టాలు కనిపించవా?



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రైతు సంక్షేమానికి పెద్దపీట అంటూ ఊకదంపుడు ప్రచారాలు చేస్తున్నారు తప్ప ఎక్కడా అన్నదాతలకు న్యాయం చేసిన సందర్భాలు లేవని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు అన్నారు. శ్రీకాకుళం నగరానికి ఆనుకుని ఉన్న 3వ డివిజన్ తంగివానిపేట ఇన్‌చార్జి తంగి అప్పన్నస్వామి, గ్రామపెద్దలు, యూత్ ఆధ్వర్యంలో మంగళవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సక్రమంగా ఎరువులు అందించకపోవడంతో పెద్ద పెద్ద క్యూలైన్లు కట్టి తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతు ఇంటి వద్దకే ఎరువులు, విత్తనాలు అందేవని గుర్తు చేశారు. ఇప్పటికి అన్నదాత సుఖీభవకు అతిగతీ లేకుండా పోయిందన్నారు. ఇదేనా రైతు సంక్షేమం అని ప్రశ్నించారు. చంద్రబాబు మోసాలు ప్రతి ఒక్కరికి తెలుసని, ఎప్పుడు ఎన్నికల వస్తాయా తగిన బుద్ధి చెబుదామా అంటూ ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ బీసీ విభాగం అధ్యక్షుడు గద్దిబోయిన కృష్ణారావు, అల్లు లక్ష్మీనారాయణ, కింజరాపు రమేష్, బైరి మురళీ, హరి, జె.శ్రీనివాస్, చందు, శాంతారావు, చందు, వానపల్లి రమేష్, కన్నబాబు, భరద్వాజ్, సత్యనారాయణ, భానుప్రసాద్, సీపాన మహేందర్, తోట తారక, పాపారావు, బగ్గు అసిరినాయుడు, కరగాన రాజారావు, హరి తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి



వంశీకిరణ్‌ను సత్కరిస్తున్న సొసైటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని విశాఖ స్పిరిట్యువల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు భీమనేని వంశీకిరణ్ అన్నారు. నగరంలోని అంబేడ్కర్ కూడలి వద్ద రెవెన్యూ భవనంలో పిరమిడ్ స్పిరిట్యువల్ ఆధ్యాత్మిక కేంద్రం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సజ్జన సాంగత్యం అనే అంశంపై మంగళవారం ప్రసంగం జరిగింది. అనంతరం ధ్యానం చేయించారు. కార్యక్రమంలో బాలాజీరావు, బిందుమాధవి, ధర్మారావు, శివ పాల్గొన్నారు.

కృష్ణాష్టమి విశిష్టతపై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న సమితి సభ్యులు

ఎచ్చెర్ల : ఆగస్టు 16న జరగనున్న కృష్ణాష్టమి వేడుకలకు సంబంధించి త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ముద్దాడపేట, ధర్మవరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పూర్వం కృష్ణాష్టమి వేడుకలు 11 రోజుల పాటు జరిగేవని, చివరిగా ఊరేగింపుతో ముగించేవారని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు గుండ జనార్దనరావు, లక్ష్మీకుమారి, తాతయ్య, సంతోష్, బ్రహ్మనాయుడు, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దమ్ములు



ఉభాలుకు సిద్ధం చేసిన పంట పొలాలు

ఎచ్చెర్ల : ఖరీఫ్ సీజన్‌లో నారాయణపురం కుడికాలువ ద్వారా సాగునీరు అందడంతో పాటు వర్షాలు అనుకూలించడంతో రైతులు దమ్ములు పనిలో బిజీ అయ్యారు. కుడికాలువ ఆయకట్టు రైతులంతా వరి పంటలు వేసేందుకు సిద్ధమయ్యారు. ఇదివరకే వరి ఆకులు వేసుకున్న రైతాంగం ఇప్పుడు దమ్ములు చేసేందుకు సిద్ధపడ్డారు. వరిఆకులు ఉభాలకు సరిపడా తయారుకావడంతో పొలాల్లో వరినాట్లు వేసేందుకు సమాయత్తమవుతున్నారు. పొన్నాడ, ధర్మవరం, రామజోగిపేట, కొంగరాం, కొత్తపేట తదితర ప్రాంతాల్లో చాలా వరకూ రైతులు దమ్ములు చేపడుతున్నారు.

జీతాలు చెల్లించాలి

ఆమదాలవలస: ఎంటీఎస్ ఉపాధ్యాయుల కుటుంబాలు ఆకలి కేకలతో అలమటిస్తున్నారని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ అధ్యక్షుడు పైడి రమణ మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. మేలో జీతం ఇవ్వలేదని, కనీసం జూన్, జూలై జీతాలైనా చెల్లించాలని డిమాండ్ చేశారు.